క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి..



కెల్లలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్

గుర్ల: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఓటర్లు సహకరించాలని ఎస్సై భాస్కరరావు కోరారు. ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు.పాలవలస,గుర్ల,కెల్ల, చింతపల్లిపేట గ్రామాల్లో గురువారం పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు.

నేడు బొత్స , కడుబండి నామినేషన్‌లు

దత్తిరాజేరు శృంగవరపుకోట: గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థులుగా బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు శుక్రవారం నామినేషన్‌లు దాఖలు చేయనున్నారు. ఈమేరకు ఆ ఎమ్మెల్యేల కార్యాలయవర్గాలు గురువారం ప్రకటన విడుదల చేశాయి. బొత్స అప్పలనరసయ్య ఉదయం10గంటలకు గజపతినగరంలోని పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి అభయాంజనేయస్వామి ఆలయానికి చేరుకుని అక్కడ పూజలు చేయనున్నారు. అక్కడి నుంచి పార్టీ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి మధ్యాహ్నం 1:15 గంటలకు నామినేషన్ పత్రాలు సమర్పించనున్నారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఉదయం 9 గంటలకు కొత్తవలసలోని తన ఇంటి నుంచి ర్యాలీగా బయల్దేరి గోల్డ్ స్టార్, సంతపేట, ఎల్.కోట, సోంపురం, బొద్దాం, వెంకటరమణపేట కూడళ్ల మీదుగా వెళ్లి ఎస్.కోట తహసీల్దార్ కార్యాలయంలో 11 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని వెదుళ్లవలస, ఆవగూడెం, కె.పాలవలస, తాటిగూడ, గెడ్డపువలస,వి.పి.రేగ, రేగటి, గెడ్డపువలస గ్రామాలతో పాటు గుర్ల మండలంలోని లవిడాం, పెదబంటుపల్లి, రొాతు పేట, డి.కనపాక గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పి.హరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గరివిడి, గర్భాం 33 కేవీ ఫీడర్ల మెయింటెనెన్స్ పనుల నేపథ్యంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సంక్షేమ,అభివృద్ధి పాలనకు పట్టం కట్టండి



మాట్లాడుతున్న బొత్స సాయిగురునాయుడు

గజపతినగరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లలో ఇంటింటికీ చేసిన సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగన్ సీఎంగా కొనసాగాలని వైఎస్సార్‌సీపీ యువనాయకుడు, గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య తనయుడు సాయిగురునాయుడు అన్నారు. గజపతినగరం మండల కేంద్రంలోని రేవళ్ల చెరువులో ఉపాధి హామీ పని ప్రదేశంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గజపతినగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య నాయకత్వంలో వందల కోట్ల రూపాయలతో తారురోడ్లు, బ్రిడ్జిలు, సిమెంట్ రోడ్లు, కల్వర్టుల నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు జరిగాయని, పార్టీలకతీతంగా అర్హులందరికీ పథకాలు అందాయని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో అరకొరగా అమలు చేసిన పథకాలను సైతం ప్రజలకు మంజూరు చేసేందుకు జన్మభూమి కమిటీ సభ్యులు లంచాలు వసూలు చేసేవారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లంచాలు, అవినీతికి తావులేకుండా, ఎవరి సిఫార్సులు అవసరం లేకుండా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందించామని చెప్పారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాలనకు మధ్య తేడాలను బేరీజువేసుకోవాలని వేతనదారులకు సూచించారు. ఎమ్మెల్యే అప్పలనరసయ్య చొరవతో నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలకు సైతం తారు రోడ్లు నిర్మించుకోగలిగామని, గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, కాలువల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలను కల్పించామని, జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగు నీటి కుళాయిల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గజపతినగరం ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొత్స అప్పలనరసయ్యను, విజయనగరం ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బెల్లాన చంద్రశేఖర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, గజపతినగరం సర్పంచ్ నరవ కొండమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.ఆదినారాయణ, నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, రేగ సురేష్, సామంతుల పైడిరాజు, కె.రాము నాయుడు, ఆల్తిరామునాయుడు, గార రమణ పాల్గొన్నారు.

ఉపకరణాలకు ఎంపిక



ప్రత్యేక అవసరాల చిన్నారికి వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

శృంగవరపుకోట: విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు పంపిణీ చేసేందుకు స్థానిక చింతబడిలోని భవిత కేంద్రంలో జిల్లా సమగ్రశిక్ష, విద్యాశాఖ నేతృత్వంలో గురువారం ఎంపిక శిబిరం నిర్వహించారు. శిబిరానికి నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన సుమారు 302 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు, వారి తల్లిదండ్రులు హాజరయ్యారు. వేర్వేరు విభాగాల వైద్యులు మురళీమోహన్, ఉదయ్‌కుమార్ పిల్లలకు పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన ఉపకరణాల కో సం ఎంపిక చేశారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు తాగునీరు, భోజనాలు, మందులు, = అందించారు. సహిత విద్య విభా గం కో-ఆర్డినేటర్ ఎస్.సూర్యారావు, ఎస్.కోట ఎంఈఓలు బి.నర్సింగరావు, జి.లక్ష్మి, ఐదు మండలాల ఐఈఆర్టీలు, భవిత కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



శృంగవరపుకోట: సంజీవిని ఆస్పత్రి సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది

శృంగవరపుకోట: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాల నివారణపై స్థానిక సంజీవిని ఆస్పత్రిలో ఫైర్‌ఆఫీసర్ షేక్ మదీనా నేతృత్వంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది గురువారం అవగాహన కల్పించారు. ఆస్పత్రుల్లో అగ్ని ప్రమాదాలు జరిగే తీరు, అందుకు గల కారణాలు, నివారణ చర్యలు, ప్రాణనష్టం లేకుండా తీసుకోవాల్సిన తక్షణ చర్యలను ఆస్పత్రి సిబ్బందికి వివరించారు. అగ్ని ప్రమాదాల వల్ల వ్యాపించే మంటలను అదుపు చేసే విధా నాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.

అప్రమత్తంగా ఉండాలి

గజపతినగరం: అప్రమత్తంగా ఉండడం, తగిన జాగ్రత్తలు పాటించడం వల్ల అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని స్థానిక అగ్నిమాపక శాఖ అధికారి ఎం.ఎస్. వి.రవిప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గజపతినగరంలోని శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ, పెట్రోల్ బంక్ వద్ద సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. సిలిండర్ల నుంచి గ్యాస్ లీకై ప్రమాదాలు సంభవించేటప్పుడు మంటలను అదుపు చేసే విధానాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల



ఆర్‌డీఓ కార్యాలయంలోని నోటీస్ బోర్డులో నోటిఫికేషన్ అతికించిన ఎన్నికల అధికారి శాంతి, తదితరులు

చీపురుపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా చీపురుపల్లి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికకు సంబంధించి ఫారం-1 ద్వారా ఎన్నికల నోటిఫికేషన్‌ను నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్‌డీఓ బి.శాంతి విడుదల చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం 10.30 గంటలకు పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయంలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసి నోటీస్ బోర్డులో అతికించారు. అనంతరం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని డీఎస్పీ కార్యాలయంతో పాటు తహసీల్దార్, ఎంపీడీఓ, పోలీస్‌స్టేషన్ నోటీస్‌బోర్డుల్లో నోటిఫికేషన్ ఉంచామన్నారు. తొలిరోజు ఎలాంటి నామినేషన్లు రాలేదని చెప్పారు. అదేవిధంగా ఓట్ ఫ్రమ్ హోమ్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల వారు, 85 ఏళ్ల వయస్సు పైబడిన వారికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తామన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి సూర్యకళ గురువారం విడుదల చేశారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొదటిరోజు ఒక్క నామినేషన్ కూడా రాలేదని తెలిపారు.నామినేషన్లు వేయాలనుకునే అభ్యర్థులు తమ సందేహాల నివృత్తికి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లో సంప్రదించాలని సూచించారు.

రూ.1.25 కోట్లతో అదనపు ట్రాన్స్‌ఫార్మర్



పూజలు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న పర్యవేక్షక ఇంజినీర్ లక్ష్మణరావు

శృంగవరపుకోట: పట్టణంలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం దృష్ట్యా వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా స్థానిక సబ్‌స్టేషన్‌లో విద్యుత్‌శాఖ అధికారులు రూ.1.25 కోట్ల వ్యయంతో 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ మువ్వల లక్ష్మణరావు గురువారం పూజలు చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధప్రాతిపదికన 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామని చెప్పారు. సంబంధిత పనులను సకాలంలో పూర్తి చేసిన సిబ్బందికి, ఉద్యోగులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈఈ జి.సురేష్‌బాబు, ఎంఎండ్ పీటీఆర్ ఈఈలు కె.వి.ఎస్.సత్యనారాయణ, డి.ఫణికిరణ్‌కుమార్, ఎస్.కోట డీఈ బి.వెంకటరావు, ఏఈ ఆర్.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ. 30 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం



కొత్తవలస జంక్షన్ వద్ద నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి సమీపంలో ఉన్న శారద మెటల్స్, ఎల్లోయిస్ కర్మాగారం తమ సీఎస్ఆర్ (సామాజిక సేవ)లో భాగంగా మండల కేంద్రంలోని విజయనగరం రోడ్డులో రూ.15 లక్షలతో, స్థానిక ఉన్నత పాఠశాలలో రూ.15 లక్షలతో మరుగుదొడ్లను నిర్మించింది. ఈ మరుగుదొడ్లను శారద కర్మాగారం ప్రతినిధి ప్రభాత్‌మోహన్ గురువారం ప్రారంభించారు. అలాగే కంటకాపల్లి గ్రామ సమీపంలో స్కిల్‌డవలెప్‌మెంట్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో కుట్టిమిషన్, కంప్యూటర్ కోర్సు, బ్యూటిఫికేషన్ తదితర అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కర్మాగార ప్రతినిధులు సన్యాసి రావు,శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం



వావిలపాడులో శ్రీరాముడి పట్టాభిషేకంలో సర్పంచ్ రాజేశ్వరి దంపతులు



బొద్దాంలో పూజలు చేస్తున్న భక్తులు

వేపాడ: మండలంలోని బొద్దాం, వావిలపాడు గ్రామాల్లోని రామాలయాల్లో గురువా రం శ్రీరాముడి పట్టాభిషేకం వైభవంగా నిర్వహించారు. అర్చకులు బొడ్డపాటి హరిశర్మ, నరసింహారావు తదితరుల ఆధ్వర్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి పట్టాభిషేకం చేసి, సాయంత్రం సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

జాగ్రత్తలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు

జామి: ఎండల తీవ్రత అధికంగా ఉందని, ప్రతి ఒక్కరూ వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని జామి పీహెచ్‌సీ వైద్యసిబ్బంది సూచించారు. మండల కేంద్రంలోని అల్లువీధి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు గురువారం అవగాహన కల్పించారు. ఏఎన్ఎం భూలక్ష్మి మాట్లాడుతూ అత్యవసరమైతే తప్ప ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బయటకు వెళ్లకూడదన్నారు. అత్యవసరమై ఎండలో బయటకు వెళ్లే వారు టోపీలు ధరించాలని, గొడుగు వేసుకోవాలని, వెంట తాగునీరు తీసుకువెళ్లాలని చెప్పారు. ఎక్కువగా నీరు తీగాలని, ద్రవపదార్థాలు అధికంగా తీసుకోవాలని వివరించారు. హెచ్‌ఎం జి.రాజారావు, ఉపాధ్యాయినులు పి.అనురాధ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

